ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు
గురువారం 21 మార్చి 2024



రంజాన్ వేళలు
ఇఫ్తార్ | 6:25 గురువారం
సహర్ | 4:50 శుక్రవారం

ఉచిత కంటి ఆపరేషన్లు

రాయికల్, మార్చి 20: రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆస్పత్రి వైద్యులతో వైద్య శిబిరం నిర్వహించగా అర్హులైనవారికి కంటి ఆపరేషన్లు చేశారు. మొదటి విడతగా సోమవారం 45 మందికి కంటి ఆపరేషన్లు చేయగా, బుధవారం మరో 50 మందిని ఆస్పత్రికి తరలించారు. అధ్యక్షుడు కొమ్ముల ఆదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మోసారపు శ్రీకాంత్, కోశాధికారి గంట్యాల ప్రవీణ్ సభ్యులు పాల్గొన్నారు.

అగ్గి రాజుకుంటే బుగ్గే



- వేసవి కాలంలో అధికంగా అగ్ని ప్రమాదాలు
- ఫైర్‌స్టేషన్‌లో వెక్కిరిస్తున్న ఖాళీలు
- అదనపు భారంతో ఇబ్బందులు పడుతున్న సిబ్బంది

● అదనపు కేంద్రాలు లేక ఇక్కట్లు...

> జిల్లాలోని కోరుట్ల, రాయికల్ పట్టణాల్లో అదనంగా అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. ఆ శాఖ అధికారులు ప్రభుత్వానికి గతంలోనే సూచించినప్పటికీ ఫలితం లేకపోయింది. గతంలో రాయికల్ తాత్కాలిక ఔట్ సోర్సింగ్ కేంద్రాన్ని నిర్వహించారు. పలు కారణాల వల్ల రాయికల్‌లో ఏర్పాటు చేసిన ఔట్ సోర్సింగ్ కేంద్రాన్ని సుమారు అయిదు సంవత్సరాల క్రితం ఎత్తివేశారు. కొత్త కేంద్రాలు ఏర్పాటు చేస్తే అగ్నిప్రమాదాలు జరిగిన సందర్భాల్లో భారీ ఆస్థి నష్టాలను నివారించడానికి అవకాశం ఉంటుదన్న అభిప్రాయాలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకొని అగ్నిమాపక కేంద్రాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

జగిత్యాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అగ్నిమాపక కేంద్రాల్లో అసౌకర్యాలు తిష్టవేశాయి. అగ్నిమాపక శాఖలో ఖాళీ పోస్టులు వెక్కిరిస్తున్నాయి. అగ్ని ప్రమాదాలు సంభవించిన సందర్భాల్లో ప్రస్తుతం ఉన్న సిబ్బందిపై అదనపు బారం పడుతుండడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. కేవలం సగం మంది సిబ్బంది మాత్రమే ఉండడంతో ఇక్కట్లు ఏర్పడుతున్నాయి. జిల్లాలో జగిత్యాల, మెట్‌పల్లి, ధర్మపురి పట్టణాల్లో అగ్నిమాపక కేంద్రాలున్నాయి. వీటిలో ఉద్యోగుల ఖాళీలు ఏళ్లతరబడి భర్తీకి నోచుకోవడం లేదు. అత్యవసర సమయాల్లో విధులు నిర్వహించాల్సిన విభాగానికి చెందిన పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. అగ్నిప్రమాదం జరిగిన సందర్భాల్లో సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఉన్న ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బందుల పాలవుతున్నారు. ప్రస్తుతం ఉన్న ఉద్యోగులపై అదనపు భారం పడుతోంది. వేసవి ప్రారంభం కావడంతో జిల్లాలో అగ్రిమాపక కేంద్రాల్లో చోటుచేసుకున్న పరిస్థితిపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న కథనమిది.

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నా..

సాధారణంగా ఒక అగ్నిమాపక కేంద్రంలో మొత్తం 16 మంది సిబ్బంది అవసరముంటుంది. ఇందులో ఒక స్టేషన్ ఫైర్ ఆఫీసర్(ఎస్ఎఫ్ఓ), ఇద్దరు లీడింగ్ ఫైర్‌మెన్ (ఎల్ఎఫ్)లు, ముగ్గురు డ్రైవర్ ఆపరేటర్ (డీఓపీ)లు,10 మంది ఫైర్‌మెన్ (ఎఫ్ఎం)లు అవసరముంటారు. జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, మెట్‌పల్లి, ధర్మపురిలో ఉన్న అగ్నిమాపక కేంద్రాల్లో పలుపోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. జగిత్యాల అగ్నిమాపక కేంద్రంలో ప్రస్తుతం ఒకరు ఆర్టీసీ నుంచి డిప్యూటేషన్‌పై డ్రైవర్ ఆపరేటర్ విధులు నిర్వహిస్తుండగా రెండు డీఓపీలు, అయిదు ఫైర్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మెట్‌పల్లిలో సైతం ఒకరు ఆర్టీసీ నుంచి డిప్యూటేషన్‌పై డ్రైవర్ ఆపరేటర్ విధులు నిర్వహిస్తుండగా రెండు డీఓపీలు, ఎనిమిది ఫైర్ మెన్‌పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ధర్మపురిలో ఒకటి ఫైర్ ఆఫీసర్, ముగ్గురు డ్రైవర్ ఆపరేటర్లు, 10 ఫైర్ మెన్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జగిత్యాలకు జిల్లా ఫైర్ అధికారి పోస్టు మంజూరు కాలేదు. నిజామాబాద్ జిల్లా ఫైర్ అధికారి జగిత్యాల బాధ్యతలను నిర్వహిస్తున్నారు.కాగా జగిత్యాలలోని మూడు అగ్నిమాపక కేంద్రాలకు కలిపి ఇటీవల సుమారు 10 మంది ఫైర్‌మెన్లు రిక్రూట్‌మెంట్ అయినప్పటికీ ప్రస్తుతం వారు హైద్రాబాద్‌లో శిక్షణ పొందుతున్నట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి. అగ్నిమాపక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులపై పలుమార్లు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలను పంపుతున్నప్పటికీ ఫలితం ఉండడం లేదు.

అప్రమత్తతతో నివారణ సాధ్యం

కొమురయ్య, ఫైర్ ఆఫీసర్, జగిత్యాల

అప్రమత్తంగా ఉండడం వల్ల అగ్ని ప్రమాదాలను కొంత మేరకు నివారించవచ్చును. అగ్నిప్రమాదాల నివారణకు ప్రత్యేక కృషిని చేస్తు న్నాము. పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ సేవలను సమర్థవంతంగా అందించడానికి పాటుపడుతున్నాము. అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తుగా తీసుకునే జాగ్రత్తలను ప్రజలకు వివరిస్తున్నాము.



జగిత్యాల అగ్నిమాపక కేంద్రం



ఫైర్ఇంజన్ వాహనం



బుల్లెట్ మిస్ట్ వాహనం

జిల్లాలో ప్రతీ యేటా సుమారు 200కు పైగా అగ్నిప్రమాదాల సంఘటనలు చోటుచేసుకుంటున్నట్లు అంచనా ఉంది. ఇందులో వేసవి కాలంలో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత సంఘటనల్లో రూ. లక్షల్లో ఆస్థి నష్టం వాటిల్లుతోంది. వేసవిలో వరి కోతల అనంతరం పొలాల్లో కొయ్యలను కాల్చడానికి మంటలు పెడుతుంటారు. ఈ మంటలు కిలోమీటర్ల మేరకు వ్యాపించి నష్టం జరుగుతోంది. అదేవిధంగా గ్యాస్, విద్యుత్ ప్రమాదాలు సైతం జరుగుతుంటాయి. అడవుల్లో చెట్ల ఆకులు రాలి బండల రాపిడితో నిప్పు పుట్టి వేల ఎకరాల్లో చెట్లు కాలిన సంఘటనలు సైతం ఉంటున్నాయి. అదేవిధంగా రైస్ మిల్లులు, కోల్డ్ స్టోరేజీ, గోదాములు, జిన్నింగ్ మిల్లులు తదితర ప్రాంతాల్లో షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. అగ్నిమాపక కేంద్రాలు సమీపప్రాంతాల్లో ఉండి తొందరగా సంఘటన ప్రాంతాలకు చేరుకున్నట్లయితే ప్రమాద తీవ్రత కొంతమేరకు తగ్గే అవకాశాలుంటాయి. జగిత్యాల, మెట్‌పల్లి, ధర్మపురిలలో అగ్ని మాపక ఇంజన్‌కు అవసరమైన బోరుబావి, బెడ్‌లు, నీటి వసతి ఉన్నాయి. జగిత్యాల, మెట్‌పల్లిలో సొంత భవనంలో కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. అగ్ని ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో సంఘటన స్థలానికి మరింత తొందరగా వెళ్లడానికి ఒక్కో అగ్నిమాపక కేంద్రంలో ఒక్కొక్క బుల్లెట్ మిస్ట్ వెహికిల్‌ను కేటాయించారు. కాగా ఎక్కువ బరువు ఉండడం వల్ల సంబంధిత ద్విచక్ర వాహనాన్ని వినియోగించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు సిబ్బంది వాపోతున్నారు. మెట్‌పల్లి, జగిత్యాల, ధర్మపురిలలో సిబ్బంది నివాసానికి అవసరమైన క్వార్టర్స్ నిర్మాణం చేయాలన్న డిమాండ్ నెరవేరడం లేదు.

యేటా సుమారు 200కు పైగా ప్రమాదాలు...

లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పుట్ట బంగారం కోసం మట్టి తవ్వుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, అర్చకులు

7

పారిశుధ్య పనులను మెరుగుపరచాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి

జగిత్యాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో పారిశుధ్య పనులను మరింత మెరుగు పరచాల్సిన బాధ్యత శానిటేషన్ అధికారులదేనని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య సిబ్బంది నిర్వహిస్తున్న పనులను చైర్‌పర్సన్ పరిశీలించారు. అనంతరం డంప్ యార్డ్‌ను సందర్శించారు. తడి. పొడి చెత్తను వేరు చేసి ఎరువులుగా తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

పోలీస్ భద్రతా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

జగిత్యాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కథలాపూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న షేక్ హబీబ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. పోలీస్ భద్రతా పథకం కింద మృతుడి కుటుంబానికి మంజూరు అయిన ఎనిమిది లక్షల రూపాయల విలువైన చెక్కును బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ చేతుల మీదుగా అందజేశారు. పోలీస్ శాఖ తరపున అండగా ఉంటామని ఎస్పీ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, సూపరింటెండెంట్ నయూమ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి: ఎమ్మెల్సీ



పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. జగిత్యాల రూరల్ మండలం తిప్పన్నపేట గంగపుత్ర మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు కొండ్ర శంకర్‌తో పాటు పలువురు సంఘం సభ్యులు, బీర్‌పూర్ మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి అప్పాల జలంధర్, బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా జీవన్‌రెడ్డి కండువాలు కప్పి మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రమేష్ తదితరులు ఉన్నారు.

రూ. 50వేల కంటే ఎక్కువగా రవాణా చేస్తే రశీదు ఉండాలి



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

కొడిమ్యాల, మార్చి 20: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవ్వరైనా రూ.. 50 వేల రూపాయల కంటె ఎక్కువగా రవాణా చేస్తె వాటికి సంబంధించిన రసీదు ఉండాలని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ అన్నారు. బుధవారం సాయంత్రం జగిత్యాల-కరీంనగర్ ప్రదాన రహదారిపై ఉన్న మండలంలోని దొంగలమర్రి పోలీస్ చెక్ పోస్ట్ వద్ద ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాలతో డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు తీసుకోవాలిసిన జాగ్రత్తలను గురించి వివరించారు. ఎన్నికలవేల ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు డబ్బు, మద్యం ఇతర సామగ్రి పంచుతూ అక్రమ రవాణా చేసే అవకాశం ఉంటుందన్నారు. వాటిని అడ్డుకోవటం కోసమే దొంగలమర్రి పోలీస్ చెకపోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. డీఎస్పీ వెంట మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అంజన్న సేవలో న్యాయమూర్తి

మల్యాల, మార్చి 20: నిజామాబాద్ అడిషనల్ న్యాయమూర్తి కనకదుర్గ బుధవారం కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయ అధికారులతోపాటు పలువురు న్యాయమూర్తులు ఉన్నారు.

ముగిసిన బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్లు

మెట్‌పల్లి, మార్చి 20: మెట్‌పల్లి బార్ అసోసియేషన్ ఎన్నికల కోసం నిర్వహిస్తున్న నామినేషన్ల గడువు బుధవారం ముగిసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. జరగబోయే ఎన్నికల్లో పోటి చేయడానికి 19 నామినేషన్లు వచ్చినట్లు ఎన్నికల అధికారులు మగ్గిడి వెంకటనర్సయ్య, సోమ భూమేశ్వర్, కోటగిరి వెంకటస్వామి, పసునూరి శ్రీనివాస్, నల్ల రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నామినేషన్ల ఉపసంహరణ ఈనెల 22 వరకు కొనసాగుతుందని, అనంతరం ఎన్నికల బరిలో ఉండే వారి పేర్లను ప్రకటిస్తామన్నారు. అసోసియేషన్ ఎన్నికలను ఈనెల 28న నిర్వహించడం జరుగుతుందని, ఎన్నికల్లో న్యాయవాదులు పాల్గొని తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. ఓటింగ్ ముగిసిన వెంటనే అదేరోజు ఫలితాలను ప్రకటిస్తామని తెలిపారు. అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారులు

సమాజ చైతన్యంలో యువత కీలక పాత్ర పోషించాలి

● ఎమెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, మార్చి 20: యువత సమాజ చైతన్యంలో కీలక భూమిక పోషించి, సమాజాన్ని పట్టి పీడిస్తున్న రుగ్మతలను పారద్రోలడానికి కంకణ బద్ధులు కావాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని భూషణరావుపేటలో కెఎంపీఎల్ 2 మండల స్థాయి క్రికెట్ టోర్నీ ఎన్ఆర్ఐ బైర దేవ్ ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో పల్లెల్లో పనుల్లో అలసటను మరిచిపోవడానికి నాటకాలు, జానపదాలతో కాలక్షేపం చేసేవారన్నారు. ప్రస్తుతం గ్రామీణ క్రీడలపై యువత ఆసక్తి కనబరుస్తోందన్నారు. ప్రధానంగా క్రికెట్ పట్ల క్రేజ్ పెరిగిన నేపథ్యంలో యువత పోటీల్లో అధికంగా పాల్గొంటున్నారన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు, శారీరక ధారుఢ్యంను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. క్రికెట్ మైదానం కోసం స్థలం కేటాయించాలని పలువురు నాయకులు, క్రీడాకారులు కోరగా తప్పకుండా సర్వేలు చేసి స్థలం కేటాయించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మినీ స్టేడియం చేసి క్రీడాకారులకు అన్ని రకాల వసతులు కల్పిస్తానన్నారు. యువత సన్మార్గంలో నడవాలని గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిస కావద్దని హితవు పలికారు. గ్రామీణ ప్రాంతాల్లో సామాజికసేవా కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగించి మంచిపేరు సంపాదించాలని కోరారు. పల్లెల్లో యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చి పెడదారినపడకుండా చూడాలని సూచించారు. అనంతరం దూలూరులో రైస్‌మిల్లును ప్రారంభించారు. కార్యక్రమంలో పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ అజీం, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గోపిడి ధనుంజయ్‌రెడ్డి, మండల రైతుసంఘ నాయకుడు గడ్డం భూమారెడ్డి, స్వామిరెడ్డి, వాకిటి రాజరెడ్డి, చిన్నారెడ్డి, చెదలు సత్యనారాయణ, బైర మల్లేశం, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



భూషణరావుపేటలో క్రికెట్ టోర్నీ ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఎన్ఎస్ఎస్ వలంటీర్లు యూనిఫాం లేని సైనికులు

కొడిమ్యాల, మార్చి 20: ఎన్ఎస్ఎస్ వలంటీర్లు యూనిఫాం లేని సైనికులని శాతవాహన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఇ మనోహర్ అన్నారు. కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల జాతీయ సేవాపథకం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏడు రోజుల ప్రత్యేక శిబిరంలో భాగంగా ఐదో రోజు బుధవారం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇ మనోహర్ వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఓటరు చైతన్యం తీసుకు రావాలని వలంటీర్లకు సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు విలువ కీలకం అన్నారు. వలంటీర్లతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతీఒక్కరు బాధ్యతయుత పౌరులుగా ఎదగాలన్నారు. పౌరులు సమసమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు వలంటీర్లు సాయినగర్‌లోని చెత్తచెదారాన్ని, వ్యర్థాలను తొలిగించారు. సాయిబాబా ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ఓటరు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఆర్ గోపికృష్ణ, కె సతీష్‌కు మార్, మాజీ ఉపసర్పంచు గడ్డం జీవన్‌రెడ్డి, ఎంపీటీసీ మహేష్, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

వడగళ్ల వాన

వెల్గటూర్, మార్చి 20: మండలంలోని వివిధ ప్రాంతాల్లో కురిసిన అకాల వర్షం రైతన్నల్లో ఒకింత ఆనందం మరికొంత ఆందోళన కలిగించింది. అసలే నీరు లేక అల్లాడతున్న పంట పొలాలకు అకాల వర్షం కొంత ఉపశమనం కలిగించినప్పటికీ కొన్ని చోట్ల వడగళ్ల వాన కురవడంతో పొలాలు, మామిడి తోటలు ఎక్కడ దెబ్బ తింటాయోనని రైతులు ఆందోళన చెందారు. కొద్దిపాటి వడగండ్లు పడడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.



చెగ్యాంలో కురుస్తున్న వర్షం

పంట ఉత్పత్తులకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇవ్వాలి

- ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్

జగిత్యాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వరి, మొక్కజొన్న తదితర పంట ఉత్పత్తులకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ. 500 బోనస్‌ను ప్రభుత్వం అందించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజుల పాలన పూర్తయిందన్నా రు. కాంగ్రెస్ పార్టీ వ్యవసాయంపై వరంగల్ డిక్లరేషన్ ఇచ్చిన ప్రకారం ప్రతీ వ్యవసాయ ఉత్పత్తులకు రూ. 500 బోనస్ అందించాల్సి ఉంటుందన్నారు. వరి ధాన్యానికి రూ. 2,200 మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ అందించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయ కార్యక్రమం కింద చెరువలను బాగు చేసి భూగర్భ జలాలు పెంచిందని తెలిపారు. జగిత్యాల నియోజకవర్గంలో సుమారు నాలుగులక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి యాసంగిలో రాబోతుందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు కనీసం రైతు బంధు సైతం ఇవ్వలేని పరిస్థితిలో ఉందని విమర్శించారు. మామిడి పంటకు ఇప్పటికే తామర పురుగు, తేనె మంచు రోగాలతో అధిక నష్టం వాటిల్లిందని తెలిపారు. జగిత్యాల నియోజకవర్గంలో సుమారు 30 వేల ఎకరాల్లో మామిడి పంటను రైతులు సాగు చేస్తూ నష్టాలకు గురవుతున్నారన్నారు. మామిడి రైతులకు ఎకరానికి రూ. 25 వేల పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం సుమారు 19 టీఎంసీలు మాత్రమే నీరు నిల్వ ఉందని, ప్రస్తుత యాసంగిలో రైతులకు అవసరమైన సాగునీరు అందించి ఒక్క ఎకరం కూడా ఎండిపోకుండా ప్రభుత్వం జాగ్రత్తలు వహించాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దావ సురేశ్, మహేశ్, రాజేంద్ర ప్రసాద్, జంబర్తి శంకర్, రాజిరెడ్డి, శేఖర్ రెడ్డి, హరీశ్, బాల ముకుందం, లక్ష్మణ్, సత్తిరెడ్డి, వంశీ, ఏనుగుల రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి


రాజయ్య(ఫైల్)

ఓదెల,మార్చి 20: మండలంలోని కనగర్తిలో బుధవారం గుండారం రాజయ్య(62) అనే కౌలు రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. రాజయ్య కనగరిలోని ఆరెల్లి రాములు అనే మరో రైతు చెందిన 2.20 ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని వరి సాగు చేశాడు. బుధవారం నీరు పెట్టేందుకు వెళ్లి పరిశీలిస్తుండగా కింద ఉన్న విద్యుత్ లైన్ తీగలు కాలికి తగిలి అక్కడికక్కడే చెందాడు. రెండు రోజుల క్రితం గాలి, దుమారానికి విద్యుత్ తీగలు తెగిపడి ఉంటాయని, ఎవరూ తొలగించకపోవడం వల్ల రాజయ్య కాలికి తగిలి దుర్మరణం చెందాడని గ్రామస్థులు పేర్కొంటున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్సై అశోక్ రెడ్డి తెలిపారు.

పెద్దపల్లిలో యువకుడు...

పెద్దపల్లిటౌన్, మార్చి 20: విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన ఘటన పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. శాంతినగర్‌కు చెందిన ఒల్లెపు ఉపేందర్(23) ఓ పాత ఇల్లు కూల్చివేసే పనికి వెళ్లాడు. విద్యుత్ సర్వీస్ వైర్‌కు తగిలి ఉపేందర్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. తోటి కార్మికుడు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి మూడేళ్ల కూతురు ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రామడుగు, మార్చి 20: మండలంలోని వెంకట్రావ్‌పల్లిలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాకేశ్ అనే యువకుడు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బోయినిపల్లి మండలంలోని అనంతపల్లి గ్రామానికి చెందిన అలువాల రాకేశ్ (21), రాగుల అరవింద్ అనే యువకులు మండలంలోని గోపాల్‌రావుపేటలో పుట్టిన రోజు వేడుకలకు హాజరైనట్లు తెలిపారు. పుట్టినరోజు వేడుకలను ముగించుకొని ఇద్దరు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా వెంకట్రావ్‌పల్లి గ్రామంలోని మూలమలుపు వద్ద మోటార్‌సైకిల్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొట్టినట్లు తెలిపారు. ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా 108 వాహనం ద్వారా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాకేశ్ మృతి చెందాడని తెలిపారు. మృతుని తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని విద్యార్థికి తీవ్రగాయాలు

మానకొండూర్, మార్చి 20: మానకొండూర్‌లో బుధవారం ఇసుక ట్రాక్టర్ ఢీకొని విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి..మానకొండూర్ గ్రామానికి చెందిన గొల్ల చరణ్‌తేజ్ అనే విద్యార్థి పోచంపల్లిలోని ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదువున్నాడు. స్నేహితుడి దగ్గరికి వెళ్లి తిరిగి వస్తుండగా అన్నారం వైపు నుంచి మానకొండూర్‌కు వస్తున్న ఇసుక ట్రాక్టర్ బాలుడిని ఢీకొట్టింది. ప్రమాదంలో చరణ్‌తేజ్‌కు తీవ్రగాయాలు కాగా 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

రెండు బస్సులు ఢీ : తప్పిన ప్రమాదం

గంగాధర, మార్చి 20: గంగాధరలో బుధవారం రెండు బస్సులు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో బస్సుల్లో ఉన్నవారు ఊపిరి పీల్చుకున్నారు. గంగాధర బస్‌స్టేషన్ నుంచి కరీంనగర్ డిపోకు చెందిన బస్సు బయటకు వస్తోంది. హుజూరాబాద్ డిపో బస్సు ప్రయాణికులతో బస్‌స్టాండుకు వెళ్తుండగా రెండు బస్సులు ఒకదానికొకటి బలంగా రాసుకున్నాయి. రెండు బస్సుల్లో ప్రయాణికులుండగా ఎవరికీ ప్రమాదం కాలేదు. విషయం తెలుసుకున్న కరీంనగర్ డీఎం, ఎస్ఐ కిరణ్‌రెడ్డిలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని బస్సులను పరిశీలించారు.

దొంగిలించిన బైక్ లభ్యం

రామడుగు, మార్చి 20 : మండలంలోని గోపాల్‌రావుపేటకు చెందిన రఘువీర్ అనే వ్యక్తికి చెందిన మోటార్‌సైకిల్ రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. కాగా బుధవారం పెగడపల్లి మండలంలోని నర్సింహునిపేటలోని క్రీడా ప్రాంగణం వద్ద బైక్ ఉందన్న సమాచారం మేరకు అక్కడికి వెళ్లి బైక్ తీసుకువచ్చినట్లు రఘువీర్ తెలిపారు.

ధర్మపురిలో బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభం



పుట్ట బంగారం కోసం స్వామి వారల సేవల ఊరేగింపు



యాజ్ఞికులు కందాలై పురుషోత్తమాచార్యులను ఆహ్వానిస్తున్న ఈవో, చైర్మన్

ధర్మపురి, మార్చి 20: ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం వేళలో మంగళవాయిద్యాలు వెంట రాగా ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, వేదపండితులు యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యుల ఇంటికి వెళ్లి ఉత్సవాలకు ఆహ్వానించారు. అనంతరం యాజ్ఞికులను ఆలయానికి తీసుకువచ్చారు. ఉత్సవాల కోసం ఆలయం పక్షాన ఈవో అర్చకులకు దీక్షావస్త్రాలు సమర్పించారు. అనంతరం లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు అంకురార్పణ, కలశ స్థాపన, ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవమూర్తులకు రక్షాబంధనం చేసిన అనంతరం నాందీముఖం, ఇదహవచనం చేసి మాతృకా పూజలు జరిపారు. స్వామి వారలకు డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, గోదావరి మహాహారతి రాష్ట్ర కో కన్వీనర్, బీజేపీ రాష్ట్ర నేత దామెర రాంసుధాకర్‌రావు పక్షాన అర్చకులు వేర్వేరుగా సొంతంగా స్వామి వారలకు పట్టు వస్త్రాలు సమర్పించారు.

● పుట్ట బంగారం కోసం స్వామి వారు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం వేళలో లక్ష్మీనృసింహస్వామి (యోగ, ఉగ్ర), వేంకటేశ్వర స్వామి వారల ఉత్సవమూర్తులను సేవలపై ఉంచి వరహాతీర్థం, పుట్ట బంగారం కోసం తీసుకెళ్లారు. సంప్రదాయ రీతిలో మంగళ వాయిద్యాలు వెంట రాగా స్వామి వారల ఊరేగింపు సేవలను చింతామణి చెరువు వద్ద నూతన వేదిక, టీటీడీ ధర్మశాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికల వద్దకు తీసుకెళ్లారు. పూజల అనంతరం అక్కడే మట్టిని తవ్వి ఆలయాలకు పుట్ట బంగారం తీసుకువచ్చారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు జరిపి స్వామివారలను దర్శనం చేసుకున్నారు. స్వామివారల సేవలను తిరిగి ఆలయాలకు తీసుకువచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు ఉత్సవాల్లో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, జడ్పీటీసీ బత్తిని అరుణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ రాంనర్సింహరెడ్డి, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, ఉత్సవ కమిటీ సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● మొదలైన భక్తుల రాక

ధర్మపురి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవా కోసం భక్తుల రాక బుధవారం రాత్రి నుంచి మొదలైంది. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 21న గురువారం జరిగే లక్ష్మీనృసింహస్వామి (యోగ, ఉగ్ర),వేంకటేశ్వర స్వాముల కల్యాణోత్సవం తిలకించే భక్తులు నెత్తి మీద ముల్లెమూట పెట్టుకుని చేరుకున్నారు. నిజామాబాద్ జిల్లా నుంచి కాలినడకతో చేరుకున్న భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో తమ ఇష్టదైవమైన లక్ష్మీనర్సింహస్వామిని కొలుస్తూ దర్శించుకున్నారు.

● బ్రహ్మోత్సవాల్లో నేడు

ఈ నెల 21న గురువారం సాయంత్రం ఆరు గంటలకు గోధూళి సుముహూర్తమున శేషప్ప కళావేదిక పైన లక్ష్మీనృసింహస్వామి (యోగ, ఉగ్ర), వేంకటేశ్వర స్వాముల కల్యాణోత్సవం జరుగుతుందని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. శేషప్ప కళావేదికపై రాత్రి ఎస్‌వి శ్రీరాంభట్టార్ భాగవతార్‌చే హరికథ గానం ఉంటుందని ఆయన వివరించారు.

అక్రమంగా మద్యం, గుడుంబా రవాణాపై ఫిర్యాదుకు కంట్రోల్‌రూం

కరీంనగర్ క్రైం, మార్చి 20: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అక్రమంగా మద్యం, గుడుంబా, గంజాయి, కల్తీకల్లు దందాలపై సమాచారం లేదా ఫిర్యాదు చేసేందుకు కరీంనగర్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్, పెద్దపల్లి, నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఎక్కడ అక్రమంగా మద్యం, గుడుంబా, కల్తీకల్లు, గంజాయి విక్రయాలు, వినియోగంపై సమాచారం ఉన్నా ప్రజలు నేరుగా కంట్రోల్ రూం నంబర్ : 8712658804కు సమాచారం అందించాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో అక్రమ మద్యం, ఇతర అక్రమ దందాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని ఏసీ తెలిపారు.

చెక్ పోస్ట్ వద్ద నగదు పట్టివేత

తంగళ్లపల్లి, మార్చి 20: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా సరిహద్దుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. బుధవారం తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల చెక్‌పోస్ట్ రూ.80 వేల 400 నగదును పోలీసులు పట్టుకున్నారు. పెద్దపెల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్‌కు చెందిన రాయికంటి వేణు వేములవాడకు కారులో వెళ్తుండగా జిల్లా సరిహద్దులోని చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలూ లేకపోవడంతో రూ. 80,400 స్వాధీనం చేసుకున్నట్లు చెక్‌పోస్ట్ అధికారులు తెలిపారు.

మద్యం పట్టివేత

జమ్మికుంట రూరల్, మార్చి 20: జమ్మికుంట మండలంలోని అంకూసపూర్ గ్రామంలో గల బెల్ట్‌షాపులపై బుధవారం పోలీస్‌లు దాడులు నిర్వహించారు. ఓదెల శ్రీనివాస్ వద్ద రూ.1400 విలువ గల మద్యం బాటిళ్లు, శామంతుల సదానందం వద్ద రూ.2600 విలువ గల మద్యం బాటిళ్లను పోలీస్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

ద్విచక్రవాహనం దొంగిలించిన వ్యక్తి అరెస్ట్

తంగళ్లపల్లి, మార్చి 19: ద్విచక్రవాహనం దొంగతనం చేసిన తంగళ్లపల్లి మండలం మండపల్లి గ్రామానికి చెందిన అల్లేపు నవీన్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తంగళ్లపల్లి మండలంలోని ఒగులాపూర్ గ్రామంలో సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా జాతరకు వచ్చిన సిరిసిల్ల పట్టణం ఇందిరానగర్ కాలనీకి చెందిన పెంట శ్రీనివాస్ తన ద్విచక్ర వాహనం పార్కు చేసి రాత్రిపూట నిద్రిస్తున్న సమయంలో చోరీకి గురైంది. దీనిపై ఆయన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్న క్రమంలో ఎస్ఐ వాహనాల తనిఖీ చేస్తుండగా దొంగిలించిన ద్విచక్ర వాహనం పట్టుబడింది. ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని చోరీకి పాల్పడిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

మల్యాల, మార్చి 20: ఒంటరితనం భరించలేక ఓయువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నూకపల్లికి చెందిన సైదులు వంశీ(23)కి రెండేళ్ల క్రితం వివాహం జరగగా మనస్పర్థలతో ఏడాది క్రితం విడాకులు అయ్యాయి. అప్పటి నుంచి వంశీ ఒంటరితనంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి తన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. బుధవారం ఉదయం వంశీ తండ్రి రాజయ్య గదిలోకి వెళ్లి చూడగా ఉరివేసుకొని మృతి చెంది ఉన్నాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు ఏఎస్సై ఆర్ కృష్ణకుమార్ కేసు నమోదు చేశారు.

బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోగ గోవర్ధన్



బీడీ యజమానుల సంఘ నాయకులకు నోటీసులు అందిస్తున్న ఏఐటీయుసీ నాయకులు

కోరుట్ల, మార్చి 20 : బీడీ కార్మికుల సమస్యలపై యాజమాన్యం దృష్టిసారించాలని, బీడీ టేకేదారులకు కమీషన్ పెంచే విధంగా యాజమాన్య సంఘం చర్యలు చేపట్టాలని బీడీ వర్కర్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోగ గోవర్ధన్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా బీడీ వర్కర్స్ యూనియన్ సభ్యులకు బుధవారం నోటీసులను అందించారు. అనంతరం కోరుట్ల పట్టణంలోని సి ప్రభాకర్ భవనంలో ఏర్పాటు చేసిన బీడీ కార్మిక సంఘ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోగ గోవర్ధన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు మాట్లాడారు. నిజామాబాదు, కరీంనగర్, ఆదిలాబాదు, వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని బీడీ పరిశ్రమల్లో పనిచేస్తున్న ఏడు లక్షల మంది కార్మికులు చాటన్ ప్యాకింగ్ నెలవారీ ఉద్యోగులకు రెండు సంవత్సరాల వేతన ఒప్పంద కాలపరిమితి మార్చి 31తో ముగుస్తుందన్నారు. ప్రస్తుతం రోజురోజుకు ధరలు పెరిగిపోయినందున బీడిలకు మూల వేతనం రూ. 300 పెంచాలన్నారు. బీడి టేకేదారులకు కమీషన్ పెంచి వారి సమస్యలు పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీడీ ఫెడరేషన్ సంఘం నాయకులు భానుప్రసాద్, ఎండీ ముక్రం, శ్రీనివాస్, అదే రంగారెడ్డి, అనసూయ, కొక్కుల శాంత, శంకర్, మల్లారెడ్డి, రవి వెంకన్న, సాంబయ్య, నరసయ్య, భూమయ్య, రాజేశం, లక్ష్మణ్, పరందాం, రమేష్, లింగం, బాపురావు, శంకర్, శేఖర్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫలించిన మొగిలిపేట రైతుల భగీరథ ప్రయత్నం



గంగనాల ప్రాజెక్ట్ వద్ద బండరాళ్లను తొలగిస్తున్న రైతులు



మొగిలిపేటకు చేరుకున్న గంగనాల ప్రాజెక్టు నీరు

మల్లాపూర్, మార్చి, 20: మండలంలోని మొగిలిపేట గ్రామానికి గంగనాల ప్రాజెక్ట్ నీరు తీసుకరావడానికి రైతులు నలభై రోజులుగా భగీరథ ప్రయత్నం చేసి సాధించుకున్నారు. ఇబ్రహీంపట్నంలోని గంగనాల ప్రాజెక్ట్ నుంచి కాలువల ద్వారా వచ్చే నీరుతోనే గ్రామంలోని పంటల సాగు జరుగుతుంది. కానీ గత కొంత కాలం నుంచి గ్రామానికి తాగు, పంట సాగుకు ఇబ్బందులు ఏర్పడి పంటలు ఎండిపోయే స్థితికి వచ్చాయి. గంగనాల ప్రాజెక్ట్ నీరు వస్తేనే గ్రామంలో సమస్యలు తీరుతాయని రైతులు భావించారు. దీంతో ప్రాజెక్ట్ నుంచి గ్రామానికి నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో చేసేది లేక గ్రామంలోని రైతులు అంతా ఒక్కటై గంగనాల ప్రాజెక్ట్ నుంచి నీరు తీసుకరావడానికి పూనుకున్నారు. గంగనాల ప్రాజెక్ట్ వద్ద పూడిక పనులు చేయకుంటే నీరు సరఫరా కాదని భావించారు. రైతులందరూ కలిసి నలభై రోజులుగా భగీరథ దీక్షలాగా పనులు చేపట్టారు. ప్రాజెక్ట్‌లోని మట్టిని, రాళ్లను తొలగించడమే కాకుండా కాలువ వెంట పెరిగిన పిచ్చి మొక్కలు, పూడిత తీత పనులు చేశారు. వారి ప్రయత్నం ఫలించి కాలువ ద్వారా గ్రామంలోని చెరువులోకి నీరు చేరుకుంది. నీటి సమస్యలు రాక ముందే అధికారులు గంగనాల ప్రాజెక్ట్ కాలవ లైనింగ్ పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

రూ.7,700 పలికిన పత్తి ధర

జమ్మికుంట, మార్చి 20: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,700 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 58మంది రైతులు 773 క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 12క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,700, కనిష్ఠ ధర రూ.5వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

బీఫార్మసీ పరీక్ష రుసుం గడువు

గణేశ్‌నగర్,మార్చ్ 20: ఎస్.యూ పరిధిలోని బి.ఫార్మసీ మూడు, ఐదవ సెమిస్టర్ (రెగ్యులర్‌సప్లిమెంటరీ), నాలుగు, ఆరో సెమిస్టర్ (సప్లిమెంటరీ) పరీక్ష రుసుం ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించడానికి 30వ తేదీ తుది గడువు అని 300/- ల అపరాధ రుసుం తో ఏప్రిల్ 3వ తేదీ లోపు చెల్లించాలని ఎస్ యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్ వి శ్రీ రంగ ప్రసాద్ తెలిపారు.పరీక్షలను ఏప్రిల్ నెలలో నిర్వహించనున్నారు.

మద్యం కట్టడికి తనిఖీలు ముమ్మరం

● ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

కరీంనగర్ క్రైం, మార్చి 20 : లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా అక్రమం మద్యం, గుడుంబా నిల్వ, సరఫరాలపై నిఘా పెట్టామని, అక్రమ మద్యంకు సంబంధించిన సమాచారాన్ని ఎక్సైజ్ శాఖ టోల్‌ఫ్రీ నెంబరు 1800-425-2523, కరీంనగర్ కంట్రోల్‌రూం 8019263862లకు సమాచారం అందించాలని కరీంనగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు. గుడుంబా నియంత్రణ కోసం గ్రామీణ ప్రాంతాలలో తనిఖీలు ముమ్మరం చేశామని తెలిపారు. మద్యం, గంజాయి, గుడుంబా అక్రమ దందాలను అరికట్టేందుకు విస్తృత దాడులు జరుపుతున్నామన్నారు. అనుమానితులను బైండోవర్ చేసి, మళ్లీ నేరాలకు పాల్పడితే తహసీల్దార్ వద్ద జరిమానా విధించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ పోలీసు శాఖలో ఇంటిలిజన్స్ టీంలను కూడా ఏర్పాటు చేశామన్నారు. తరచుగా వాహనాల తనిఖీలు, పెట్రోలింగ్ కుడా నిర్వహిస్తున్నామన్నారు.

నిలిపి ఉంచిన వ్యాన్ చక్రాలు చోరీ

శంకరపట్నం, మార్చి 20: శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలోని కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి పక్కన నిలిచిన ఓ వ్యాన్ ముందు చక్రాలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితుడు ఎరడపల్లి గ్రామానికి చెందిన భూతం సంపత్ జీవనోపాధి కోసం తాడికల్ గ్రామంలో పాత ఇనుప సామాను వ్యాపారం చేస్తున్నాడు. బుధవారం తెల్లవారు జామున చూసేసరికి సుమారు రూ. 50వేల విలువ చేసే తన డీసీఎం వ్యాన్ ముందు చక్రాలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

పెట్రోలులో నీళ్లు వచ్చాయని ఆందోళన

ఎల్లారెడ్డిపేట, మార్చి 20: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామ శివారులోని భారత్ పెట్రోలు బంక్‌లో పెట్రోల్‌లో నీళ్లు వచ్చాయని వాహనదారులు బుధవారం ఆందోళనకు దిగారు. బాధితుల కథనం మేరకు.. గుం డారంకు చెందిన ఇద్దరు తమ వాహనాల్లో పెట్రోలు అయిపోవడంతో బాటిళ్లలో తీసుకెళ్లేందుకు బంక్‌కు చేరుకున్నారు. బాటిళ్లలో పెట్రోలు పోయించుకుని వాహనం వద్దకు వెళ్లగా అడుగు భాగంలో నీళ్లలాగా కనిపించింది. దాంతో బంక్‌కు వెళ్లి నిర్వాహకులను ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఆందోళనకు దిగారు. ఇదేమిటంటూ నిలదీశారు. కల్తీ పెట్రోలు వల్ల తమ వాహనాలు చెడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు బంకుల్లో తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పెళ్లి విందులో పరస్పర దాడి

● కేసు నమోదు చేసిన పోలీసులు

మెట్‌పల్లి రూరల్, మార్చి, 20: మండలంలోని ఆత్మకూర్ గ్రామంలోని పెళ్లి విందులో జరిగిన పరస్పర దాడిలో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. బుధవారం గ్రామానికి చెందిన అమ్మాయికి వేములవాడకు చెందిన అబ్బాయితో కుటుంబ సభ్యులు, బంధువుల సమక్షంలో ఘనంగా వివాహం జరిపించారు. అనంతరం జరిగిన విందులో అబ్బాయి తరుపున బంధువులకు భోజనం పెట్టడడం లేదని నిలదీశారు. దీంతో ఇరు వర్గాల మధ్య గొడవ జరిగి పలువురికి గాయలయ్యాయి. దీంతో అమ్మాయి తరుపు బంధువు దుద్దిళ్ల తిరుపతి అబ్బాయి తరుపు ఏడుగురిపై, అబ్బాయి తండ్రి నారాల రాజు అమ్మాయి తరుపు తొమ్మిది మందిపై ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వేంపేటలో మద్యం పట్టివేత

మెట్‌పల్లి మండలంలోని వేంపేట గ్రామానికి చెందిన పల్లి శేఖర్‌గౌడ్ బెల్ట్ షాప్ నిర్వహిస్తూ మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. 4లీటర్ల మద్యం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న జితేందర్ యాదవ్

బీర్‌పూర్, మార్చి 20: మండలంలోని తుంగూర్ గ్రామానికి చెందిన ఎనిమిది మంది లబ్ధిదారు లకు బుధవారం ఉమ్మడి సారంగాపూర్ మండలం కాం గ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కన్వీనర్ జితేంద ర్ యాదవ్ చేతుల మీ దుగా చెక్కులను పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సహకారంతో లబ్ధిదారులకు లక్షా 55వేల 500 రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందించామన్నారు. కార్యక్రమంలో నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సమాచారం లేకుండా గౌడ సంఘం కమిటీ ఏర్పాటు

రాయికల్, మార్చి 20: ఎలాంటి సమాచారం లేకుండా గౌడ సంఘం మండల కమిటీని ఏర్పాటు చేయడం విడ్డూరమని రాయికల్ మండల గౌడ సంఘం నాయకులు పేర్కొన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండల గౌడ సంఘం ఏర్పాటు చేసినటువంటి ఈ కమిటీకి రాయికల్ మండల గౌడ సంఘానికి ఎలాంటి సంబంధం లేదని అన్నారు. 26 గ్రామాల్లో ఉన్న గౌడ సంఘం కమిటీలకు ఎలాంటి సమాచారం లేకుండా కేవలం మూడు, నాలుగు గ్రామాల సంఘం సభ్యులతో కొత్త మండల కమిటీని నియమించడం విడ్డూరమన్నారు. త్వరలోనే కొత్తమండల కమిటీలను నియమిస్తామని, అప్పటివరకు ఎలాంటి మండల కమిటీలు లేవని అన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు గుర్రం మహేందర్ గౌడ్, మర్రిపెల్లి నారాయణ గౌడ్, కోల రాజ్ కుమార్, బండారి సురేందర్, పడాల రమేష్ కుమార్, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ



పూజకార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్, మార్చి 20: మండలంలోని అర్పపల్లిలో జరుగుతున్న మల్లికార్జునస్వామి ఉత్సవాల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆధ్వర్యంలో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నాయకులు కొండ్ర రాంచందర్ రెడ్డి, బేతి పూర్ణ చందర్‌రెడ్డి, ఆకుల రాజిరెడ్డి, బేర మహేష్, ప్రజలు పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకంపై ప్రజలకు క్లారిటీ ఇవ్వాలి

35వ వార్డు కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ

జగిత్యాల అర్బన్, మార్చి 20: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహజ్యోతి పథకంపై ప్రజలకు అనేక సందేహాలున్నాయని, అర్హత ఉన్నా జీరో బిల్లు రాక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని 35వ వార్డు కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇదే విషయమై కలెక్టర్‌కు వినతి పత్రం అందించిన అనంతరం జయశ్రీ మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు ఉండి, 200 యూనిట్ల కరెంటు టిక్ మార్క్ చేయక కొందరు, యూఎస్‌సీ మీటర్ నంబర్ వేయక మరికొందరు అర్హత పొందలేక పోయారన్నారు. గృహజ్యోతి పథకంలో దొర్లిన తప్పుల కారణంగా ప్రజలు మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నార న్నారు. మున్సిపల్ అధికారులు తమకు ఎడిట్ ఆప్షన్ ఇవ్వలేదని, ఆప్షన్ వచ్చే వరకు తామేమి చేయలేమనడంతో ప్రజలు సమస్య పరిష్కారం కోసం తిరిగి తిరిగి బేజారవుతున్నారన్నారు. అర్హత ఉండి రాని వారి పరిస్థితి ఏంటనే ప్రశ్నకు మున్సిపల్ అధికారులు గానీ, ప్రభుత్వం గానీ ప్రకటన చేయాలని కోరారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

మల్లాపూర్, మార్చి, 20: మండలంలోని రాఘవపేట గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వార్షికోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆలయంలో బుధవారం ఉదయం నుంచి పురోహితులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిత్యహోమము, బలిహరణాదులు వంటి కార్యక్రమాలను ఘనంగా జరిపారు. అనంతరం స్వామి వారి కల్యాణాన్ని పురోహితుల వేదమంత్రోచ్చరణాల మధ్య వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, సరోజన దంపతలు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డిల పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపి మొక్కులు చెల్లించి స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామి వారి ఆశీస్సులతో నియోజకవర్గంలోని ప్రజలు ఎల్లవేళలలో ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో బాగుండాలని కోరుకున్నారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భారత్ బియ్యం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



బియ్యం చూపుతున్న బీజేపీ నాయకులు

కోరుట్ల, మార్చి 20: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భారత్ రైస్ (బియ్యం) పథకాన్ని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని పట్టణ బీజేపీ నాయకులు కోరారు. బుధవారం పట్టణంలోని భీమునిదుబ్బ ప్రాంతంలోని ఏర్పాటు చేసిన భారత రైస్ కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు చేయడంతో పాటు నిరుపేదలకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ పెండం గణేష్, బీజేపీ సీనియర్ నాయకుడు బెజ్జారపు చందు మాట్లాడారు. పేద మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన బియ్యం తక్కువ ధరలకు లభిస్తుం దన్నారు. కేంద్ర ప్రభుత్వం భారత్ రైస్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తూ నిరుపేదలకు బియ్యం అందుబాటులో ఉంచుతోందనిన్నారు. ఈ కార్యక్రమంలో జక్కుల ప్రవీణ్ కుమార్, గందె నవీన్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కలాల సాయిచంద్, రంజిత్‌రావు, గుండేటి సంజీవ్, గుండేటి సాయి ఉన్నారు.

మెట్టు సాయికుమార్ నియామకంపై హర్షం

కథలాపూర్: రాష్ట్ర పారిశ్రామిక సహకార సంఘాల సమైఖ్య చైర్మన్‌గా మెట్టు సాయికుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వుల జారీ చేయడంపై రాష్ట్ర కాంగ్రెస్ ఫిషర్‌మన్ విభాగం కార్యదర్శి కల్లెడ గంగాధర్ హర్షం వ్యక్తం చేశారు. మత్స్య సహకార సంఘాల బలోపేతం కోసం మెట్టు సాయికుమార్ చేసిన కృషిని ప్రభుత్వం గుర్తించడం గర్వించదగ్గ విషయమన్నారు. జగిత్యాల ఫిషర్‌మెన్ అధ్యక్షుడు రజినీకాంత్, వెల్గటూర్ మండల అధ్యక్షుడు గుమ్ముల వెంకటేశ్, జగిత్యాల నియోజకవర్గ ఫిషర్‌మెన్ కార్యదర్శి గుమ్మల రాజేశ్ ఉన్నారు.

మానవత్వం చాటుకున్న కారోబార్

జగిత్యాల రూరల్, మార్చి 20: జగిత్యాల మండలం తిప్పన్నపేట గ్రామ పంచాయతీ కారోబార్ తన మానవత్వాన్ని చాటుకున్నారు. జగిత్యాల పట్టణానికి చెందిన పేల్పుల పుష్పలత అనారోగ్యంతో బాధపడుతూ జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అత్యవసరంగా మహిళకు రక్తం కావాల్సి ఉండడంతో బంధువుల ద్వారా సమాచారం అందుకున్న కారోబార్ రమేష్ బాధిత మహిళకు రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాడు. కారోబార్ ను పలువురు అభినందించారు.

పేదలను దోచి పెద్దలకు పంచి పెడుతున్న మోదీ సర్కార్

- పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ ఎన్డీఏ, ఇండియాకూటమి మధ్యే
- ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి

రాయికల్, మార్చి 20: కేంద్రంలోని ఎన్డీఏ సర్కార్ హయాంలో ఎక్కువగా రైతులు, యువకులు, రైతు కూలీలే నష్టపోయారని, ఈ ప్రభుత్వం పేదలను దోచి బడా వ్యాపారవేత్తలకు పంచి పెడుతోందని ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి అన్నారు. రాయికల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలో రైతులు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని ఆందోళన చేస్తే ఈ ఉద్యమాన్ని అణగదొక్కడానికి మోదీ సర్కార్ ప్రయత్నాలు చేస్తోందన్నారు. కేంద్రంలో యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు కనీస మద్దతు ధర అందించి ఏకకాలంలో రూ.లక్ష రుణాలు మాఫీ చేసిందని గుర్తు చేశారు.

నిత్యావసర వస్తువుల ధరలను అదుపులో పెట్టి ప్రజలకు అండగా ఉందన్నారు. పదేళ్ల ఎన్డీఏ సర్కార్ హయాంలో రైతులకు కనీస మద్దతు ధర ఎండమావిగానే మారిందని, రుణమాఫీ ఊసే లేదని, యువకులకు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు హామీలకే పరిమితమైందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయని, ధరలను అదుపులో పెట్టడంలో మోదీ సర్కార్ విఫలమైందన్నారు. రసాయనిక ఎరువుల ధరలను రెట్టింపు చేశారని, డీజిల్, పెట్రోల్ ధరలను పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్న మోదీ సర్కార్ తీరును ప్రతీ ఒక్కరు ఎండగట్టాలని సూచించారు. రైతులకు కనీస మద్దతు ధర అందివ్వలేదని, యువకులకు ఉద్యోగాల కల్పన ఎండమావిగానే మారిందని, ఉపాధిహామీ పథకంలో నిధుల కోత విధించి రైతు కూలీల పొట్టకొడుతున్నారని విమర్శించారు.

నిరుద్యోగ యువతకు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తే నిరుద్యోగం తగ్గేదని, ఈ పదేళ్లలో 20 కోట్ల ఉద్యోగాలు లభించేవని తెలిపారు. పసుపు పంటకు మద్దతు ధర లేక పంట పండించడం తగ్గించారని, పసుపు బోర్డు ఎక్కడ ఏర్పాటు చేశారో చెప్పాలన్నారు. పసుపు రైతులకు ఇప్పటికైనా బోర్డు ఏర్పాటు చేసి స్పష్టతనివ్వాలని సూచించారు. కనీస మద్దతు ధర అందించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ఎన్నికల్లో పోటీ మహా కూటమి, ఎన్డీయేకు మధ్యే ఉంటుందన్నారు. నిజామాబాద్ లోక్‌సభ స్థానంలో ఎవరు పోటీ చేసినా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించడం తథ్యమని అన్నారు. మిషన్ భగీరథ పథకం పేరుతో గత సర్కార్ ఫిల్టర్‌బెడ్ పథకాలను నిర్వీర్యం చేసిందని జీవన్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు.

జగిత్యాల నియోజకవర్గంలోని రాయికల్, జగిత్యాల, బీర్‌పూర్ మండలాల్లోని ఫిల్టర్‌బెడ్ పథకాల పునరుద్ధరణకు రూ.13.97 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. రాయికల్ మండలా నికి రూ.4 కోట్ల 97 లక్షలు, బీర్‌పూర్ మండలానికి రూ.3.70 కోట్లు, జగిత్యాల మండలానికి రూ.5.30 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. త్వరలో ఈ ఫిల్టర్‌బెడ్ పునరుద్ధరణ పనులను ప్రారంభించనున్నట్లు చెప్పారు.

రాయికల్ మండలం కుమ్మరిపెల్లి నుంచి రాయికల్ మూడు విగ్రహాల వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు రూ.2.17 కోట్లు, రాయికల్ ప్రభుత్వ కళాశాల నుంచి ఇటిక్యాల ఒడ్డెర కాలనీ వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు రూ.1.60 కోట్ల నిధులు మంజూరైనట్లు వివరించారు. సమావేశంలో మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీందర్‌రావు, మహేందర్‌గౌడ్, నాయకులు గోపి రాజరెడ్డి, మ్యాకల రమేష్, బాపురపు నర్సయ్య, బత్తిని భూమయ్య, దాసరి గంగాధర్, దిలీప్, హరీష్‌రావు, సుధీర్, కొయ్యడి మహిపాల్, దివాకర్ రెడ్డి, నాగరాజు, శ్రీనివాస్, గోపాల్, పొన్నం శ్రీకాంత్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

కూచిపూడి కళాకారిణి అంజనశ్రీకి సన్మానం

రాయికల్: మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన కూచిపూడి కళాకారిణి బొమ్మకంటి అంజనశ్రీని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బుధవారం సన్మానించారు. అంజనశ్రీ నాలుగు సంవత్సరాల వయస్సులో స్కూల్ బస్సు ప్రమాదంలో ఎడమ కాలు కోల్పోగా కృత్రిమ కాలుతో కూచిపూడి నృత్యం నేర్చుకుంటూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు ప్రదర్శనలు చేసి అవార్డులు అందుకుంది. అంజనశ్రీకి కృత్రిమ కాలు అవసరం ఉండగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించింది. వెంటనే స్పందించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి కృత్రిమ కాలు పెట్టించే విధంగా చూస్తానని మాట ఇచ్చారు. అనంతరం అంజనశ్రీని సన్మానించి మున్ముందు చాలా ప్రదన్శనలు చేస్తూ ముందుకు సాగాలని ఆశీర్వదించారు. అలాగే ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

బలహీనవర్గాలపై దాడులు సరికాదు

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి, మార్చి 20: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత బలహీన వర్గాలపై దాడులు ఎక్కువయ్యాయని, అమాయక ప్రజలపై దాడులు చేయడం సరికాదని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ హితవు పలికారు. బుధవారం మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన దళిత కుటుంబానికి చెందిన గొర్రె మల్లేష్, బీఆర్ఎస్ కార్యకర్త గొర్రె రంజిత్‌పై మెట్‌పల్లి జడ్పీటీసీ భర్త, అధికార పార్టీ నాయకుడు కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి దాడిచేసి తీవ్రంగా గాయపరచడంతో మెట్‌పల్లి డీఎస్పీకి బాధితులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మనుషుల పేగులు మేడలేసుకొని తిరుగుతా, పండబెట్టి తొక్కుత అంటూ మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు అదే బాటలో నడుస్తూ చేతల్లో చూపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు బలహీన వర్గాలపై చేస్తున్న దాడులను ఆపకపోతే ప్రజలే తగిన బుద్ధి చెప్తారని, పదవులు ఎవరికి శాశ్వతం కాదని హితవు పలికారు. నియోజకవర్గంలోని బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉండి కాపాడుకుంటామన్నారు. మళ్లీ బలహీనవర్గాలు, బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు పునరావతం కాకుండా డీఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.



బాధితులతో కలిసి డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

కోరుట్ల, మార్చి 20: పది పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మ్యాడవేణి సునీల్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పట్టణంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని సదుపాయాలు కల్పించాలని అన్నారు. ప్రశాంత వాతావరణలో పరీక్షలు రాసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

బీఆర్ఎస్ నియోజకవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలి

కోరుట్ల, మార్చి 20: పట్టణంలో గురువారం జరిగే బీఆర్ఎస్ నియోజకవర్గ సమావేశం విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్ అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో అనిల్ మాట్లాడారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, బీఆర్ఎస్ నిజామాబాదు ఎంపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌లు హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని అన్నారు.

పోచమ్మ తల్లికి ప్రభుత్వ విప్ అడ్లూరి పూజలు



పూజలు చేస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్, మార్చి 20: మండలంలోని శాఖాపూర్‌లో గ్రామ దేవత పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బుధవారం పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ధర్మపురి నియోజకవర్గ ప్రజలను చల్లంగా చూడమని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అడ్లూరిని శాలువాతో సత్కరించారు. అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేంధర్‌రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి రమేష్, పంజాల తిరుపతి, రవి, వెంకటస్వామి, నాయకులు పాల్గొన్నారు.

- **మాజీ మంత్రి కొప్పుల..**

శాఖాపూర్‌లో నిర్వహిస్తున్న పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో బుధవారం మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జూపాక కుమార్, రవి, సత్యం, తిరుమల్‌చారి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి కొప్పుల

దాసాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఉప్పరిపేటలో బుధవారం శ్రీ దాసాంజనేయ స్వామి దేవాలయ భూమి పూజ మహోత్సవ కార్యక్రమాన్ని పద్మనాయక వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి తదితరులు భూమి పూజ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గిరి నాగభూషణం, విజయ లక్ష్మి, అల్లాల రమేష్ రావు, నక్క జీవన్‌తో, మాజీ జడ్పీటీసీ జితేందర్ రావుతో పాటు ఉప్పరిపేట పద్మనాయక వెలమ సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

కోరుట్ల ఎస్ఐకి సన్మానం

కోరుట్ల రూరల్, మార్చి 20: కోరుట్ల-2 ఎస్ఐగా బదిలీపై వచ్చిన శ్వేతను బుధవారం యువజన కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కోరుట్ల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలేటి మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు తేలు రాజుకుమార్, ఇంద్రాల హరీష్ ఎస్ఐ శ్వేతను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డును మంజూరు చేయాలి



విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మెట్‌పల్లి రూరల్, మార్చి 20: మండలంలోని పలు గ్రామాల మీదుగా వేములవాడకు డబుల్ రోడ్‌ను మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను నాయకులు కోరారు. బుధవారం మండలంలోని కోనరావుపేట, కథలాపూర్ మండలంలోని గ్రామాలకు చెందిన నాయకులు ప్రభుత్వ విప్‌కు కలిసి సమస్యలను తెలుపుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేములవాడ మండలంలోని దుంపేట నుంచి చింతకుంట, భూషణరావుపేట, ఊట్‌పల్లి, పెగ్గర్ల, మెట్‌పల్లి మండలంలోని కోనారావుపేట, రామారావుపల్లె గ్రామాల వీదుగా కోరుట్ల సమీపంలోని పెద్దగుండు వరకు డబుల్ రోడ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు నిర్మాణం జరిగితే ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల జిల్లాల వారు వేములవాడలోని రాజారాజేశ్వర స్వామికి దర్శనానికి వెళ్లే వారికి దూరం తగ్గడమే కాకుండా గ్రామాల అభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్‌కు వివరించి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. దీంతో రోడ్డు మంజూరుకు కృషి చేస్తానని ఆది శ్రీనువాస్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆయా గ్రామాల్లోని నాయకులు జక్కని పరంధాములు, శేఖర్‌రెడ్డి, భూమరెడ్డి, గంగారెడ్డి, నవీన్, ఎస్‌యూ రెడ్డి, కిషాన్, రవి, రాజేందర్, తదితరలు ఉన్నారు.

కమనీయం నరసింహస్వామి కల్యాణం



కిషన్‌రావుపేటలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వెల్గటూర్, మార్చి 20: మండలంలోని కిషన్‌రావుపేట శివారులో పెద్ద గుట్టపై వెలసిన నాగవల్లి లక్ష్మీనర్సింహస్వామి కల్యాణాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం జగన్నాథం విష్ణువర్ధనాచార్యులు, మురళీధరాచార్యులు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రాభోధిక, విస్వక్సేనవిధి, బలిహరణం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం వసంతోత్సవం, స్వామి వారి కల్యాణమహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని కనులారా తిలకించిన భక్తులు తరించిపోయారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు స్వామి వారి ఉత్సవ విగ్రహాలను శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు స్వామి వారికి మంగళహారతులతో ఎదురేగి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ప్రేరణ పోటీలకు విద్యార్థుల ఎంపిక

వేములవాడ టౌన్, మార్చి 20: తెలంగాణ రాష్ట్ర కామర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న ప్రేరణ పోటీలకు అగ్రహారం కామర్స్ విద్యార్థులు ఎస్ భాగ్యలక్ష్మి, శ్రావణి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా బుధ వారం విద్యార్థులను అభినందించారు. సికింద్రాబాద్‌లోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో శనివారం నిర్వహించే పోటీల్లో రంగోళి విభాగంలో పోటీపడనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల దశనుంచే ఓటుహక్కుపై అవగాహన అవసరం



ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు



స్వీప్ ముగ్గుతో విద్యార్థినులు

జగిత్యాల అర్బన్, మార్చి 20: ప్రతీ పౌరుడికి పాఠశాల దశనుంచే ఓటుపై అవగాహన అవసరమని వక్తలు అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ఓల్డ్ హైస్కూల్‌లో కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటు హక్కుపై అవగాహన, స్వీప్‌పై క్విజ్‌పోటీలు విద్యార్థులకు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఓటర్స్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థి దశ నుంచే ఓటుపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ప్రతీ ఒక్కరిని భాగస్వాములను చేస్తూ అనేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఎలాంటి ప్రలోభాలు, భయాలు లేకుండా ఓటింగ్ ప్రక్రియ జరగాలన్నదే ఎన్నికల నిర్వహణ, ఓటింగ్ ఉద్దేశమని తెలిపారు. ఓటు విలువ తెలుసుకొని ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ముగ్గులు వేసి ప్లకార్డులతో ఓటుపై అవగాహన కోసం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రజిత, ఉపాధ్యాయులు భోనగిరి దేవయ్య, పద్మ, ఆనందరావు, సూర్యప్రకాష్, విద్యాదేవి, అరుణ, అనిత, సురేందర్, మల్లికార్జున్, హరిత, శ్రీనివాస్, రాజేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగిత్యాలలో శునకానికి పూజలు

జగిత్యాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని తులసీనగర్‌లో ఓ మహిళ శునకానికి పూజలు నిర్వహించి తన భక్తిబావాన్ని చాటుకుంది. వాణీనగర్‌కు చెందిన నాగమల్ల రాజేశం-అనంత లక్ష్మి దంపతులు ఇటీవల పుణ్యక్షేత్రం కాశీ పర్యటనకు వెళ్లి బుధవారం జగిత్యాలకు చేరుకున్నారు. కాశీ పర్యటన అ నంతరం కాళ భైరవుని ప్రతిరూపానికి పూజలు చేయడం ఆనవాయితీలో భాగంగా శునకానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీ నుంచి తెచ్చిన పవిత్ర జలాలతో శునకానికి పూజలు నిర్వహించి మొక్కు లు చెల్లించుకున్నట్లు నాగమల్ల రాజేశం-అనంతలక్ష్మి పేర్కొన్నారు.